ప్రజాశక్తి
బుధవారం 16 అక్టోబర్ 2024
5
విజయనగరం

తాడు లాగి సిరిమానోత్సవాన్ని ప్రారంభిస్తున్న రాష్ట్రమంత్రి కొండపల్లి,ఎంపి కలిశెట్టి

సిరిమానోత్సవాన్ని తిలకిస్తున్న వేలాది జనం

అమ్మవారికి పట్టువస్త్రాలు అందజేస్తున్న అశోక్‌గజపతిరాజు, అదితి విజయలక్ష్మి; అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి కొండపల్లి కుటుంబసభ్యులు; పండ్లు, పూలు తీసుకెళ్తున్న మంత్రి సంధ్యారాణి

అమ్మవారికి కోడిని మొక్కుతున్న మహిళ

# అంబరాన్నంటిన సిరిమాను సంబరం

- లక్షలాది మంది హాజరు
- పైడితల్లమ్మ దర్శనానికి పోటెత్తిన జనం
- పట్టువస్త్రాలు సమర్పించిన రాష్ట్రమంత్రి కొండపల్లి
- అమ్మవారిని దర్శించుకున్న పలువురు ప్రముఖులు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/ టౌన్, కోట

ఉత్తరాంధ్రులు కల్పవల్లిగా భావించే విజయనగరం పైడితల్లి అమ్మవారి సిరిమాను సంబరం అంబరాన్ని తాకింది. చీకటి పడక ముందే సిరిమానోత్సవాన్ని ముగించాలన్న లక్ష్యాన్ని ఈ ఏడాది అధికార యంత్రాంగం సాధించింది. పోలీసు ఆంక్షలతో గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది జనం తగ్గారు. మంగళవారం సాయంత్రం మధ్యాహ్నం 3.45గంటలకు సిరిమానోత్సవం వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ రాష్ట్రమంత్రి కొండపల్లి శ్రీనివాస్ సిరిమాను రథాన్ని తాడు లాగి ప్రారంభించారు. సిరిమానుకు ముందు భాగంలో సంప్రదాయ బద్దంగా పాలధార, ఐరావతం, అంజలి రథం, బెస్తవారివల ఒకదాని తరువాత మరొకటి ముందుకు సాగాయి. అమ్మవారి ప్రతిరూపంగా భావించే ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు సిరిమానును అధిరోహించారు. అమ్మవారి ఆలయం నుంచి పైడితల్లి అమ్మవారి పుట్టినిల్లు అయిన కోట వద్దకు సిరిమానును మూడుసార్లు ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు పూలు, అరటి పండ్లు విసిరి, కొందరు కోళ్లను చూపి తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ అపూర్వ ఘట్టాన్ని లక్షలాదిమంది తిలకించారు. రాష్ట్ర ఎంఎస్ఎ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు సిరిమాను రథం వెంట ఉండి ఆద్యంతమూ నడిపించారు. జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్, జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ ఎప్పటికప్పుడు సిబ్బందికి ఆదేశాలను జారీ చేశారు. ఉత్సవాన్ని సకాలంలో పూర్తి చేయడానికి కృషి చేశారు.

అమ్మవారి సిరిమానోత్సవాన్ని పూసపాటి వంశీయులు, పైడితల్లి ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతి రాజు, రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, విశాఖ ఎంపీ భరత్ దంపతులు, మాజీ ఎంపీ వైరిచర్ల ప్రదీప్ చంద్రదేవ్ దంపతులు, స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి, ఉండి ఎంఎల్ఎ ఆర్.రఘురామ కృష్ణంరాజు తదితర ప్రముఖులు, కీర్తి శేషులు, ఆలయ మాజీ ధర్మకర ఆనందగజపతిరాజు సతీమణి సుధా గజపతి, కుమార్తె ఊర్మిళ గజపతి, ఇతర రాజ కుటుంబీకులు ఎప్పటి మాదిరిగానే కోట బురుజు పైనుంచి సిరిమానోత్సవాన్ని వీక్షించారు.రాష్ట్ర శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తమ కుటుంబంతో కలిసి డిసిసిబి కార్యాలయం నుంచి ఉత్సవాన్ని తిలకించారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఇతర పోలీసు అధికారులు బందోబస్తు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షించారు. పోలీసులు మూడు అంచెల్లో బారికేడ్లను ఏర్పాటు బందోబస్తు నిర్వహించారు.

### పైడితల్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి కొండపల్లి,

అంతకుముందు ఉదయం పైడితల్లి అమ్మవారికి రాష్ట్ర ప్రభుత్వం తరపున చిన్న మధ్య తరహా పరిశ్రమల శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఆయన కుటుంబ సమేతంగా మంగళవారం ఉదయం అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త, కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గజపతిరాజు అమ్మవారిని దర్శించుకొని పట్టు వస్త్రాలు సమర్పించారు.

రాష్ట్ర గిరిజన, స్త్రీ సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, స్థానిక ఎమ్మెల్యే పి.అదితి విజయలక్ష్మి, బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన, ఉండి ఎమ్మెల్యే పి.రఘురామరాజు, శాసమండలిలో ప్రతిపక్ష నాయకుడు బొత్స సత్యనారాయణ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి, పార్వతీపురం మన్యంజిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ దంపతులు, సినీనటుడు సుమన్ తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### ఆకట్టుకున్న పులివేషాలు, కత్తిసాము ప్రదర్శన

సిరిమానోత్సవ అనంతరం కోట లోపల పులివేషాలు, కత్తి సాము ప్రదర్శన ఆకట్టుకుంది. వీటిని కేంద్ర మాజీ మంత్రి, మాన్సాస్ సంస్థ చైర్మన్ పూసపాటి అశోక్ గజపతిరాజు, రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, రాష్ట్ర విపత్తుల, అగ్నిమాపకశాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్, జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, విశాఖ ఎంపీ భారత్, స్థానిక ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, విజయనగరం మండల పార్టీ అధ్యక్షులు బొద్దల నర్సింగరావు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి గొంప కృష్ణ, రాజేష్ బాబు, టిడిపి నాయకులు వీక్షించారు.

సిరిమానుకు మొక్కుతున్న బొత్స సత్యనారాయణ కుటుంబ సభ్యులు

అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అలరించిన పులివేషాలు

సిరిమానోత్సవంలో ముందుసాగిన పాలధార

ఐరావతం

అంజలి రథం

, బెస్తవాని వల

ధర్నా చేస్తున్న పోస్టల్ ఉద్యోగులు

# తపాలా ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రద్దు చేసిన ఎన్ఎఫ్‌పిఇ , ఎఐఎన్ఎఫ్‌పిఇ, సంఘాల గుర్తింపును తక్షణమే పునరుద్ధరించాలని డిమాండ్‌చేస్తూ పోస్టల్ ఉద్యోగులు మంగళవారం ప్రదాన తపాలా కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తపాలా శాఖను కార్పోరేటీకరణ మరియు ప్రైవేటీకరణ దిశగా ప్రోత్సహించే పోస్టల్ యాక్ట్-2023ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్నాను ఉద్దేశించి పోస్టల్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు పి.శ్రీనివాసరావు, వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐపిపిబి ఆధ్వర్యంలో నడిపిస్తున్న సాంకేతికపరమైన అన్ని పనులను గతంలో మాదిరిగా తపాలాశాఖ ఆధ్వర్యంలో నడిపించే విధంగా వెనక్కి తీసుకోవాలని, 68వ వేతన సవరణ కమిటీ వెంటనే నియమించాలని డిమాండ్ చేశారు. పాత పెన్షన్ విధానాన్ని తిరిగి పునరుద్ధరించాలన్నారు. అన్ని కేడర్లలో ఖాళీగా వున్న పోస్టులను తక్షణమే భర్తీచేయాలని, గ్రూప్-సి ఉద్యోగుల 2వ దశ కేడర్ రీస్టక్చరింగ్ ప్రారంభించాలని కోరారు. అశాస్త్రీయమైన, ఆచరణ సాధ్యంకాని టార్గెట్లు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల సంక్షేమానికి కోర్టులు ఇచ్చే అన్ని ఉత్తర్వులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో నాయకులు వి.రుద్ర ప్రతాప్,వి.గోవిందరావు, ఎ.పెంట పాపయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

వైద్యాధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళావెంకట్రావు

## అదుపులోనికి రాని డయేరియా

### మరో నలుగురు మృతి..ఐదుకు చేరిన మృతులు

భయాందోళనలో గ్రామస్తులు

ప్రజాశక్తి - గుర్ల

గుర్ల మండల కేంద్రంలో డయేరియా విజృంభించడంతో పలువురు గుర్ల, నెల్లిమర్ల, విజయనగరం ఆస్పత్రిల్లో చికిత్స పొందుతున్నారు. డయేరియాతో సోమవారం గుర్లకు చెందిన చింతపల్లి అప్పారావు మృతి చెందగా మంగళవారం వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఒకే గ్రామానికి చెందిన నలుగురు సారికి పెంటయ్య, తోంద్రంకి రాము, గుమ్మడి పైడమ్మ, కలిశెట్టి సీతమ్మలు కన్నుమూశారు. దీంతో గ్రామస్తులు భయందోళనకు గురవుతున్నారు. నాలుగు రోజులుగా ఈ గ్రామానికి చెందిన చాలా మంది ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి వైద్య సేవలు అందిస్తున్నా వ్యాధి అదుపులోకి రాకపోవడంతో ఆందోళన వ్యక్తమవుతోంది. ఆస్పత్రుల్లో ఇప్పటికే చేరిన వారిలో కొంత మంది రికవరీ అవుతున్నా మరి కొంత మంది ఆస్పత్రుల్లో చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

# పోలీసుల ఆంక్షలతో ప్రజలకు ఇక్కట్లు

- ముందురోజు నుంచే బారికేడ్లతో జనాల కట్టడి
- సోవారం రాత్రి ట్రాఫిక్ జామ్‌తో బెదిరిపోయిన ప్రజానీకం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

మునుపెన్నడూ లేని విధంగా పోలీసులు ఆంక్షలు విధించడంతో ఈ ఏడాది సిరిమానోత్సవానికి జనం తగ్గారు. ముందు రోజు (సోమవారం) ఉదయం నుంచే అటు అంబటి సంత్రం జక్షన్, ఇటు మెయిన్‌రోడ్డులో శివాలయం వీధి జంక్షన్, ఇంకోవైపు కోట ఇలా అన్ని దిక్కుల్లోనూ బారికేడ్లు ఏర్పాటు చేయడంతోపాటు పోలీసులు ఎక్కడికక్కడ నిర్భందించారు. మరోవైపు ఉత్సవాల నేపథ్యంలో నగరంలోకి వేలాదిగా వచ్చిన వాహనాలను ట్రాఫిక్ మళ్లించ లేకపోయారు. దీంతో, కోట, అయోధ్యామైదానం, ఆనందగజపతి ఆడిటోరియం, బాలాజీ కూడలి ఇలా ఒకటేమిటి దాదాపు నగరంలో ట్రాఫిక్ అస్తవ్యస్తంగా మారింది. సోమవారం ంరాత్రి అయోధ్యమైదానంలో జరిగిన మ్యూజికల్ నైట్ చూసేందుకు వచ్చిన జనం ఉక్కిరి బిక్కిరి అయ్యారు. ఒకానొక దశలో ఉద్రిక్త పరిస్థితి నెలకుంది. పైన పేర్కొన్న కూడళ్లతోపాటు ఆర్టీసి కాంప్లెక్స్ వరకు ట్రిఫిక్ రద్దీ ఎక్కువగానే కనిపించింది. ఒక చోటు నుంచి మరో చోటుకు వెళ్లాలంటే గంటల కొద్దీ సమయం పట్టింది. దీంతో, ఉత్సవాల్లో అన్ని వేదికలూ తిలకించాలని ఆశపడినవారు నిరాశ చెందారు. ఇలాంటి పోలీసుల చర్యల వల్ల సిరిమానోత్సవాన్ని చూసేందుకు వచ్చిన జనం తగ్గుముఖం పట్టారు. గతంలో సిరిమానోత్సవానికి మధ్యాహ్నం 12గంటల నుంచే నాలుగు దిక్కుల నుంచి కోట నుంచి అమ్మవారి ఆలయం వరకు ఉండే భవనాలు, ఇళ్లు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, దుకాణాల్లోకి వేలాదిగా చేరుకునేవారు. సిరిమాను తిరిగే సమయానికి అద్యంతం మేడలపై నుంచి తిలకించేవారు. కొందరైతే దుకాణాలు, పోలీసులు ఏర్పాటుచేసిన బారికేడ్లకు మధ్య మండుటెండలో నిలబడి మరీ గంటల కొద్దీ నిరీక్షించేవారు. ఈ సారి అటువంటి పరిస్థితి కనిపించలేదు. ఎక్కడ ఏమాత్రం లోపం జరిగినా సస్పెన్షన్లు, మోమోలు తప్పవంటూ పోలీసు అధికారులు తమ సిబ్బందిని హెచ్చరించారట. దీంతో, పోలీసులంతా నగరంలో ప్రతి చోట ఒకింత కఠినంగా వ్యవహరించడంతో సిరిమానోత్సవం జరిగిన చోట మిద్దెలన్నీ ఖాళీగానే ఉండిపోయాయి. బారికేడ్లలో పెద్దగా జనాలు లేరు. సిరిమాను తిరిగే ప్రాంతంలో మాత్రం రెవెన్యూ, దేవస్థానం ఇచ్చిన పాసులతో గతం కంటే ఎక్కువగానే వచ్చారు. ఉదయం నుంచే పలుచోట్ల బారికేడ్లు ఏర్పాటు చేసి జనాన్ని కట్టడి చేయడంతో ఆలయ దర్శనానికి, ఉత్సవాలు తిలకించేందుకు వచ్చిన జనం తీవ్ర అవస్థలు పడ్డారు. దుకాణ దారులు తమకు బేరాలు లేకుండా చేశారని, మునుపెన్నడూ తొళ్లే ఉత్సవం రోజున ఇటువంటి

పోలీసుల ఆంక్షలతో ఖాళీగా ఉన్న బారికేడ్లు

లేవని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. పండలు, ఉత్సవాల్లో జనాలు రావడం సహజం. వీరందర్నీ బాగస్వామ్యం చేస్తేనే ప్రజల పండగల అవుతుంది. కానీ, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగిపోయో అన్న పోలీసు బాసుల అభద్రతా భావం సిరిమానోత్సవానికి జనం తగ్గేలా చేసింది.

### పోలీసుల ఓవరాక్షన్

సిరిమాను సందర్భంగా పోలీసులు ఓవరాక్షన్ చేయడంతో అమ్మవారిని దర్శించుకోవలసిన భక్తులు బారికేడ్లకు అవతలే ఉండిపోవాల్సి వచ్చింది. దీంతో ప్రధానంగా మూడులాంతర్ల నుంచి అంబటిసత్రం వరకు బారికేడ్లు జనం లేక వెలవెల బోయాయి. పోలీసులు సమయానికి ముందే బారికేడ్ల వద్ద గేట్లను మూసివేయడంతో అమ్మవారి దర్శనం దొరక్క రోడ్డుపైనే కొబ్బరికాయలు కొట్టి ఊసురోమంటూ భక్తులు వెనుదిరిగారు. ఎంతో దూరం నుంచి దర్శనానికి వస్తే ఇలా చేస్తారా అంటూ పోలీసులపై మండిపడ్డారు. అంతేకాకుండా మీడియావారిని సైతం లోపలకు అనుమతించక పోవడంతో పోలీసులకు, విలేకర్లకు వాగ్వివాదం చోటు చేసుకుంది. పాస్‌లు ఉన్నప్పటికీ అనుమితించక పోవడంతో పోలీసుల చర్యలపై మండిపడ్డారు.

# అందరి సహకారంతో ప్రశాంతంగా సిరిమానోత్సవం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవం పోలీసు బందోబస్తు మధ్య ప్రశాంతంగా ముగిసింది. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసుశాఖ చేపట్టిన పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు, ముందస్తు భద్రత, జాగ్రత్తా చర్యలు సత్ఫలితాలిచ్చాయి. సిరిమాను వెంబడి జిల్లా ఎస్‌పి వకుల్ జిందల్ తిరిగి, బందోబస్తు ఏర్పాట్లును స్వయంగా పర్యవేక్షించారు. సిరిమానోత్సవం ముగిసిన తరువాత భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఉండేందుకు ప్రధాన కూడళ్ల లో బ్యారికేడ్లును ఒక క్రమ పద్ధతిలో తొలగించి, వారు అన్ని మార్గాలలో వెళ్ళేందుకు అనుమతించారు. పోలీసుశాఖ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పోలీసు సేవాదళ్ దివ్యాంగులు, వద్ధులు, గర్భిణీలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సేవలందించారు. ప్రత్యేక క్రైం బృందాలు పట్టణంలోని రద్దీ ఉన్న ప్రాంతాల్లో కలియ తిరుగుతూ, అనుమానం ఉన్న వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి వేలి ముద్రలను ఎం.ఎస్.సి.డి. డివైజ్లో పరిశీలించి, ఎటువంటి చెడు నడత లేదని నిర్ధారణ చేసుకున్న తరువాతనే వారిని విడిచి పెట్టారు. విద్యుత్, అటవీ, ఆరోగ్య, మున్సిపల్, ఫైర్, రెవెన్యూ,దేవాదాయ మరియు ఇతర శాఖలు సమన్వయంతో పని

బందోబస్తును పరిశీలిస్తున్న విపత్తుల శాఖ డిజి ప్రతాప్, ఎస్‌పి వకుల్‌జిందాల్

చేశాయి. కమాండ్ కంట్రోల్ నుంచి ఎస్‌పి వకుల్‌జిందాల్, అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, చీపురుపల్లి డిఎస్పీ ఎస్.రాఘవులు పర్యవేక్షించారు.

# పారిశుధ్య కార్మికుల సేవలు భేష్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అమ్మవారి పండగలో నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు స్ఫూర్తిగా నిలిచాయి. సిరిమాను వెంట భక్తులు విసిరే అరటి పండ్లు ,కొబ్బరి కాయలు పూలు ఎప్పటికప్పుడు ఏరివేస్తూ రోడ్డుపై అరటి పండ్లు జిగురు అంటకుండా వెంట వెంటనే బ్లీచింగ్ చల్లి రోడ్లను పరిశుభ్రంగా ఉంచారు. సుమారుగా 150 మంది కార్మికులు పనులు పారిశుధ్య పనుల్లో చేపట్టారు. వీటితో పాటు నగరానికి వచ్చిన భక్తులకు తాగునీరు అందించడంలో,.తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేసి సౌకర్యాలు కల్పించడం వంటి సేవలు అందించాయి. సోమవారం రాత్రి లక్షలు మంది భక్తులు నగరంలో తిరగడంతో వారికి నగరపాలక సంస్థ అధించిన సౌకర్యాలు ఎంతగానో ఉపయోగపడ్డాయి. నగర పాలక సంస్థ సిబ్బంది,పారిశుధ్య కార్మికులు అందించిన సేవలను ఎప్పటికప్పుడు నగర పాలక సంస్థ కమీషనర్ నల్లనయ్య

సిరిమాను తిరిగే రోడ్లను శుభ్రం చేస్తున్న కార్మికులు

పర్యవేక్షించారు. పారిశుధ్య కార్మికులు అందించిన సేవలు వెనుక మున్సిపల్ హెల్త్ అధికారి సాంబమూర్తి, అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు నగర పాలక సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయంలో భక్తుల రద్దీ

అమ్మవారిని దర్శించుకుంటున్న అశోక్, ఎమ్మెల్యే అదితి

మొక్కులు తీర్చుకుంటున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన

సిరిమాను సందర్శనకు పోటెత్తిన యాత్రికులు

బొత్స సత్యనారాయణకు అమ్మవారి చిత్రపటాన్ని అందిస్తున్న ఇఒ

## పైడితల్లమ్మ జాతర చిత్రమాలిక

పైడితల్లమ్మ దర్శనానికి క్యూలో ఉన్న భక్తులు

దర్శనానికి వెళుతున్న జిల్లా జడ్జి సాయి కళ్యాణ చక్రవర్తి

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ అంబేద్కర్, ఎస్‌పి వకుల్ జిందాల్

కోటలో పులివేషాలను తిలకిస్తున్నటిడిపి నాయకులు, పోలీసులు, అధికారులు

కోటపై నుంచి సిరిమాను సంబరాన్ని వీక్షిస్తున్న అశోక్ గజపతిరాజు కుటుంబ సభ్యులు

ఆశీర్వాదం పొందుతున్న ఉండి ఎమ్మెల్యే కృష్ణంరాజు

సేవలందిస్తున్న రెడ్ క్రాస్ సభ్యులు

కుటుంబ సభ్యులతో కలిసి దర్శనానికి వచ్చిన మన్యం కలెక్టర్

## రంగరాయపురం సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

రంగరాయపురం గ్రామంలో సమస్యలు పరిష్కరించాలని సిపిఎం పార్టీ శాఖ మహాసభలో తీర్మానించారు. మంగళవారం శాఖ కార్యదర్శి ఉడమల ప్రసాద్ అధ్యక్షతన శాఖ మహాసభ నిర్వహించారు. డివిజన్, మండల కార్యదర్శులు పి.శంకర్రావు, ఎస్. గోపాల్‌లు పాల్గొని మాట్లాడారు. గ్రామంలో సిసి రోడ్లు తక్షణమే వేయాలని, పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో దోమలు పెరిగిపోయి గ్రామంలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని తక్షణమే శానిటేషన్ చేపట్టాలని కోరారు. గ్రోత్ సెంటర్ దగ్గరలో ఉన్న స్వామివారి చెరువుకు వెంగళరావు కాలువ నుండి సాగునీరు అందించడానికి కృషి చేయాలన్నారు. బిసి, ఎస్‌సి కాలనీ, శ్మశాన వాటికకు రోడ్లు వేయాలని, ప్రహరీ, షెడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నామని తీర్మానం చేశారు. ఈ తీర్మానం ఆమోదించిన వారిలో శాఖ కార్యదర్శి వుడముల ప్రసాదు, వుడమల భూషణం, సాంబ మూర్తి, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

## అప్పలనాయుడుకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రానికి చెందిన అప్పలనాయుడు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకున్న 'మన నేస్తం' సంఘం సభ్యులు ఆయనకు రూ. 5వేలు ఆర్థిక సాయాన్ని మంగళవారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిపి మృతి బాధాకరం

ప్రజాశక్తి- కొత్తవలస

టిడిపి సీనియర్ నాయకులు, మాజీ ఎంపిపి పోలమరశెట్టి రాజన్న మృతి బాధాకరమని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మంగళవారం ఆయన పార్థివదేహానికి ఎమ్మెల్యే దంపతులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజన్న పలుమార్లు మండల అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టారని టిడిపి కుటుంబాల్లో చెరగని ముద్ర వేసుకున్నారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

## ఇ - పంటపై రైతులకు అవగాహన

ప్రజాశక్తి - గజపతినగరం

మండలంలోని గంగచోళ్ల పెంట రైతు సేవా కేంద్రంలో మంగళవారం రైతులకు ఇ -పంటపై సహాయ వ్యవసాయ సంచాలకులు కె.మహారాజన్, ఎఒ ధనలక్ష్మి అవగాహన కల్పించారు. ఇ-పంట నమోదు ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. ఇ-పంటలో ఏమైనా అభ్యంతరాలు ఉంటే బుధవారంలోగా గ్రామ వ్యవసాయ సహాయకులకు తెలియజేయాలన్నారు. అనంతరం, పొలంపిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పత్తి పంటను సందర్శించి రైతులకు తగు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, వ్యవసాయ విస్తరణ అధికారి ఎ.సతీష్, గ్రామ సర్పంచ్ బోని సంగమయ్య, ఎంపిటిసి కనకల చిన్నపైడన్న, కనకల రమణంధం, మురళి తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ మీట్‌కు మరోసారి బొబ్బిలి కుర్రోడు

ప్రజాశక్తి- బొబ్బిలి

రామభద్రపురం మండలం ముచ్చెర్లవలస గ్రామానికి చెందిన శపతి అశోక్ ఇప్పటికే చాలా సార్లు 800 మీటర్లు, 1500 మీటర్ల రన్నింగ్ విభాగాల్లో అనేక పథకాలు సాధించాడు. ఈ మేరకు వచ్చే నెలలో జరగనున్న నేషనల్ మీట్ రన్నింగ్ విభాగంలో తను అర్హత సాధించడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు. ఈ మేరకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యక్రమాల నిర్వహణ కార్యదర్శి బాబు పాలూరు మంగళవారం బొబ్బిలిలో తనను అభినందించి, నగదు ప్రోత్సాహం అందించి తనకు ఎటువంటి సహాయం కావాలన్నా తాము అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేన రామభద్రపురం జనసైనికులు చీమల సతీష్, ఉత్తరవిల్లి తిరుమల, బెల్లాన పోలారావ్, ఉమ్మిరెడ్డి జగదీశ్, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.


ఘటాలతో వీధుల్లో తిరుగుతున్న మహిళలు

## ఘనంగా పైడితల్లమ్మ జాతర

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని సారిపల్లిలో వెలిసిన పైడితల్లమ్మ జాతరను మంగళవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు ఘటాలతో గ్రామ పురవీధుల్లో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని పూజారి కిలారి సతీష్ నడిపించారు. ఏటా విజయనగరం పైడితల్లమ్మ జాతర రోజు ఇక్కడ జాతర జరగడం విశేషం.

## పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- వేపాడ

మండలంలోని కెఆర్‌పేట ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ జి.జగదీశ్వరరావు మంగళవారం సందర్శించి పాఠశాల పరిసరాలు, ప్రార్థన, విద్యార్థుల తెలుగు, ఇంగ్లీష్ చదివించడం, రాయించడం, అంకెలు, సంఖ్యలు, చతుర్విధ ప్రక్రియలు చేయించడం, వర్క్ బుక్స్ పరిశీలన చేశారు. విద్యా బోధనలో టిఎల్ఎం విరివిగా వినియోగించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పిచ్చి మొక్కలు తొలగించాలని ఆయాకు సూచించారు. టాయిలెట్స్, పరిసరాలు, తరగతి గదులను ప్రతిరోజూ శుభ్రం చేయాలని సూచించారు.

## వైన్ షాపు పెట్టొద్దని మహిళల ఆందోళన

ప్రజాశక్తి- నెల్లిమర్ల

మండలంలోని సతివాడలో వైన్ షాపు పెట్టొద్దని ఆ గ్రామానికి చెందిన మహిళలు మంగళవారం ఆందోళన చేపట్టారు. గ్రామంలోని రెల్లిపేటలో ప్రస్తుతం ఉన్న వైన్‌షాపు ప్రాంతంలో కొత్త షాపు పెట్టొద్దని డిమాండ్ చేస్తూ ఆందోళనకు దిగారు. వైన్‌షాపు వల్ల వందలాది కుటుంబాలు ఆర్థికంగా చితికిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. షాపు ఏర్పాటు చేస్తే ఆందోళన మరింత ఉధృతం చేస్తామని మహిళలు హెచ్చరించారు.

# 'పల్లె పండగ'తో గ్రామాలు అభివృద్ధి

ప్రజాశక్తి - వేపాడ

పల్లె పండగ కార్యక్రమంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి అన్నారు. మండలంలోని మంగళవారం పాటూరు, వీలుపరితి గ్రామాల్లో పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.30లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే లలిత కుమారి శంకుస్థాపన చేశారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకంతో గ్రామాల అభివృద్ధిపై ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో పాటూరు ఎంపిటిసి, వీలుపరితి సర్పంచ్ సేనాపతి లీల, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఇఒపిఆర్‌డి రవికుమార్, పిఆర్ జెఇ అలీ, ఎపిఒ ఆదిలక్ష్మి, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**సంతకవిటి:** పల్లెలను అబివృద్ధి చేసేందుకే పల్లే పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపిడిఒ సురేష్ తెలిపారు. మండలంలోని బిల్లానా, తలతంపర గ్రామాల్లో మంగళవారం పల్లె పండగ కార్యక్రమాన్ని

వేపాడ: గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

రేగిడి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్

నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం 15వ ఆర్థిక సంఘ నిధులను విడుదల చేసిందన్నారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పనతో పాటు రైతులకు ఉపయోగపడేలా అభివృద్ధి పనులను చేపట్టనున్నట్లు వివరించారు. అనంతరం గ్రామంలో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు రమ, సింగిపురపు సరస్వతి, రుగడ జగన్నాథం, కోరికన సింహాచలం, కొల్లా అప్పలనాయుడు, వల్లూరు గణేష్, గట్టి భాను, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

**రేగిడి:** రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం టిడిపితోనే సాధ్యమని ఎమ్మెల్యే కోండ్రు మురళీ మోహన్ అన్నారు. మంగళవారం మండలంలోని రేగిడి, ఆమదాలవలస, చిన్న శిర్లాం, పెద్ద శిర్లాం గ్రామాల్లో పల్లె పండగలో భాగంగా రూ.15 కోట్లతో సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా కోండ్రు మాట్లాడుతూ గత ప్రభుత్వం అభివృద్ధిని నిర్లక్ష్యం చేస్తే ప్రస్తుత టిడిపి ప్రభుత్వం అభివృద్ధిని పరుగులు పెట్టిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోండ్రు జగదీష్, కిమిడి అశోక్ కుమార్, దూబ ధర్మారావు, గురవాన నారాయణ రావు, రమేష్, మహేష్, యూపీ రాజు, కడగల నాగరాజు, ఎంపిడిఒ శ్యామలకుమారి, ఎపిఒ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

**డెంకాడ:** మండలంలోని సింగవరం, చొల్లంగిపేట పంచాయతీల్లో మంగళవారం పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే లోకం నాగమాధవి, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ కర్రోతు బంగార్రాజు సింగవరం పంచాయతీ నుంచి ఏటొడ్డి కల్లాలు వరకూ బిటి రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పల్లెల అభివృద్ధిపై దృష్టి పెట్టి పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర్ రావు, టిడిపి మండల అధ్యక్షులు పల్లె భాస్కరరావు, నాయకులు కలిదిండి పాణిరాజు, జనసేన డెంకాడ మండల కోఆర్డినేటర్ పైలాశంకర్, సీనియర్ నాయ కులు చింతపల్లి రామ్మూర్తి, పతివాడ శ్రీను, పిన్నింటి రాజా రావు, లింగం రమేష్, లింగం లక్ష్మణ్, మహంతి మురళి, తత్తడి సూర్యప్రకాష్, మహంతి చిన్నం నాయుడు, మహంతి నరసింహ నాయుడు, పైల శీను, రొంగలి వెంకటరావు, ఎంపిడిఒ భవాని, అధికారులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెలే, చైర్మన్

## ఘనంగా అబ్దుల్ కలాం జయంతి

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని వేపాడ, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఎపి ఆదర్శ పాఠశాల, బిఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలోనూ, కెజిబివి వసతి గృహంలోనూ, విక్టరీ హైస్కూల్, ప్రభుత్వ పాఠశాలలో మంగళవారం ఎపిజె అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయులు, ఎంఇఒలు పాల్గొన్నారు.

**వంగర:** భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ ఆదర్శనీయుడు అని వంగర వివేక్ మాస్టర్ మైండ్స్ ప్రిన్సిపాల్ బి ఈశ్వరరావు అన్నారు. మంగళవారం వివేక్ మాస్టర్ మైండ్స్ హైస్కూల్ ఆవరణలో అబ్దల్ కలామ్ జయంతి వేడుకలు ఘనం గా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ భారత రత్న

వంగర: కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రిన్సిపాల్ ఈశ్వరరావు

అబ్దుల్ కలామ్ జీవితం ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. అబ్దుల్ కలామ్ సమస్త ప్రపంచానికి ఆదర్శంగా నిలిచిన నిరాడంబరుడని క్షిపణి పితామహుడుగా పేరుగాంచారని అన్నారు. భారత రాష్ట్రపతిగా ఆయన సేవలు మరవలేనివని అన్నారు. జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి విద్యార్థులు ఉపాధ్యాయులు పూలమాలలు తీసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

ప్రజాశక్తి- బొబ్బిలి

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకటరావు అన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి అల్లాడ భాస్కరరావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని తెలుసుకుని మంగళవారం కళా వెంకటరావు ఆయన్ను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కళా వెంకటరావు

వైసిపి హయాంలో అభివృద్ధి పూర్తిగా కుంటు పడితే కూటమి ప్రభుత్వం అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందన్నారు. 10వేల మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు విశాఖలో టాటా కంపెనీ పెట్టేందుకు ఒప్పందం జరిగిందని చెప్పారు. భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణం వేగవంతంగా జరుగుతుందన్నారు. వైసిపి ప్రభుత్వం నాసిరకం మద్యం అమ్మి ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడితే కూటమి ప్రభుత్వం నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు ఇస్తుందని చెప్పారు. ఆ ప్రభుత్వంలో జీతాలు కోసం ఉద్యోగులు, పెన్షనర్లు ఇబ్బందులు పడితే కూటమి ప్రభుత్వం ప్రతినెల ఒకటికి జీతాలు ఇస్తుందని చెప్పారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పని చేస్తున్నట్లు చెప్పారు. ఆయనతో ఎమ్మెల్యే బేబినాయన ఉన్నారు.

## డిఎల్‌టిసి ఉద్యోగుల అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక ఎన్‌జిఒ హోమ్‌లో ప్రభుత్వ ఐటిఐ డిఎల్‌టిసి ఉద్యోగుల అసోసియేషన్ కమిటీ ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. అధ్యక్ష, కార్యదర్శులుగా బి.అప్పలకొండ, టివి గిరి, ఉపా ధ్యక్షులు కె.రాములప్పుడు, డి.శేఖర్, జాయింట్ కార్యదర్శులుగా వి.శ్రీనివాసరావు, పివి భాస్కర్, కోశాధికారిగా ఎ. రామినాయుడు, ఇసి సభ్యులుగా కె.యుగంధర్, కె.ఝాన్సీరాణి, బి.ధనలక్ష్మి, ఎం.చిన్నారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బొబ్బిలి ఐటిఐ యూనిట్ ఎన్నికల్లో అధ్యక్షులుగా సిహెచ్ రాజు, సెక్రటరీగా సిహెచ్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా వై.మోహన్, ట్రెజరర్‌గా స్వర్ణలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

అధికారిగా రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.దేముడు, అసిస్టెంట్ ఎన్నికల అధికారిగా కోట్ల శ్రీనివాసరావు, పరిశీలకులుగా బి.రామారావు, కె.సత్యరాజు వ్యవహరించారు. ప్రభుత్వ ఐటిఐ ఉద్యోగుల సమస్యలు పరిష్కారానికి పని చేస్తామని నూతన కమిటీ సభ్యులు చెప్పారు.

## అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి

ప్రజాశక్తి- బొబ్బిలి

సిబిఎం పాఠశాల స్థలం అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కోరుతూ వామపక్షాలు, ప్రజా సంఘాలు ఆధ్వర్యంలో మంగళవారం చెవులో పువ్వులు పెట్టుకుని వినూత్న నిరసన తెలిపారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపి గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి.శంకరరావు, కోట అప్పన్న, రైతు సంక్షేమ సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, ఎంఆర్‌పిఎస్ నాయకులు సునీల్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు విద్యను అందించే పాఠశాల స్థలాన్ని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయడం

నిరసన తెలుపుతున్న నాయకులు

అన్యాయమన్నారు. అక్రమ రిజిస్ట్రేషన్ రద్దు చేసి పాఠశాలను అక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

ప్రజాశక్తి- రేగిడి

ఉత్తరాంధ్ర సాగునీటి పెండింగ్ ప్రాజెక్టులు తక్షణమే పూర్తి చేయాలని రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అప్పలనాయుడు, జిల్లా అధ్యక్షులు నారు జనార్ధన్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం సంకిలి గ్రామంలో రైతులతో సమావేశమై ఈ నెల 22న అనకాపల్లిలో నిర్వహించనున్న రైతు సదస్సుకు కరపత్రాన్ని విడుదల చేశారు. వారు మాట్లాడుతూ పాలకుల నిర్లక్ష్యం వల్ల ఉత్తరాంధ్ర వెనుక నెట్టి వేయబడుతుందని, అన్ని వనరులు ఉన్నప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుందన్నారు. బ్రిటిష్ కాలం నాటి సాగునీటి వనరులు కలిగిన ఉత్తరాంధ్ర నేడు వర్షాల కోసం ఎదురుచూడాల్సిన దీనస్థితికి పాలకులు నెట్టేసారన్నారు. వంగర మండలంలో తోటపల్లి పాత కాలవ నుంచి సుమారు 4వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదని వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన కొత్తవలస, బంగారు వలస, కొప్పరవలస,రుషింగి తలగాం, శివ్వం తదితరు గ్రామాల్లో పంటలు ఎండిపోతున్నాయని నీరు ఇచ్చే నాధుడే లేరని మండిపడ్డారు. ఈ నెల 22న నిర్వహించనున్న సదస్సుకు ప్రతి ఒక్కరూ హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం పార్వతీపురం మన్యం జిల్లా అధ్యక్షులు కిమిడి రామ్మూర్తి, సంఘం నాయకులు మక్కా గురునాయుడు, ధర్మాన రాములు, పాల్గొన్నారు.

PRAGATHI COLLEGE OF PHYSICAL EDUCATION
Ardhannapalem, Kothavalasa (V&M), Vizianagaram District

Admission Notification

P.G M.P.Ed.(MASTAR OF PHYSICAL EDUCATION) Spot, Management & EWS Quota Admissions (2024-2026 Year)

Applications are called from eligible students (with or without APPGCET-2024) for Admission into M.P.Ed.Who have completed their Graduation with B.P.Ed PHYSICAL EDUCATION subject. The Vacancies will be filled as per the guidelines of the Chairman, APPGCET-2024. Very few seats are available in Spot, Management Quota and EWS Quota.

The Applications Should reach the College on or before 22-10-2024 along with all Original Certificates and Prescribed Fees.

Sd/
Principal

SRI VIVEKANANDA DEGREE & PG COLLEGE
S.KOTA (V&M), Vizianagaram District

Admission Notification

P.G (M.Sc Organic Chemistry) Spot, Management & EWS Quota Admissions (2024-2026 Year)

Applications are called from eligible students (with or without APPGCET-2024) for Admission into M.Sc Organic Chemistry Who have completed their Graduation with Chemistry subject. The Vacancies will be filled as per the guidelines of the Chairman, APPGCET-2024. Very few seats are available in Spot, Management Quota and EWS Quota.

The Applications Should reach the College on or before 22-10-2024 along with all Original Certificates and Prescribed Fees.

Sd/
Principal

PRAGATHI PG COLLEGE
Kothavalasa (V&M), Vizianagaram District

Admission Notification

P.G (M.Sc Organic Chemistry) Spot, Management & EWS Quota Admissions (2024-2026 Year)

Applications are called from eligible students (with or without APPGCET-2024) for Admission into M.Sc Organic Chemistry Who have completed their Graduation with Chemistry subject. The Vacancies will be filled as per the guidelines of the Chairman, APPGCET-2024. Very few seats are available in Spot, Management Quota and EWS Quota.

The Applications Should reach the College on or before 22-10-2024 along with all Original Certificates and Prescribed Fees.

Sd/
Principal